క్లుప్తంగా

రెండో విడత గొర్రెలు పంపిణీ చేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న గొర్రెలకాపరులు

భీమారం: ప్రభుత్వం వెంటనే రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని బుద్ధారం గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు శుక్రవారం గొర్రెలు, మేకలు పెంపకందారుల సహకార సంఘం జిల్లా కార్పొరేషన్ చైర్మన్ కొమ్ము అశోక్‌యాదవ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. గొర్రెల కోసం డీడీ తీసి సంవత్సరం దాటిందని, ఇప్పటికీ గొర్రెలు అందలేదని వాపోయారు. గొర్రెలు వస్తాయని, అప్పులు చేసి మార్జిన్ మనీ కింద వాటా చెల్లించామన్నారు. అశోక్‌యాదవ్ మాట్లాడుతూ మంత్రి శ్రీనివాస్‌యాదవ్ దృష్టికి తీసికెళ్లి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

అదనపు డైరెక్టర్ సందర్శన



వివరాలు తెలుసుకుంటున్న అదనపు డైరెక్టర్

జన్నారం: బోదకాలు నివారణ మందుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జన్నారం మండలంలోని కవ్వాల్, కామన్‌పల్లి, కిష్టాపూర్ గ్రామాల్లో వైద్యారోగ్యశాఖ అదనపు డైరెక్టర్ నాగయ్య సందర్శించారు. గ్రామంలో మందుల పంపిణీ చేస్తున్న విధానాన్ని ఆశ వర్కర్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమం వివరాలు, మందుల పంపిణీ తీరును వైద్యాధికారి ఉమశ్రీ ని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీహెచ్‌వో రమేశ్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, యూనిట్ ఆఫీసర్ నాందెవ్, సిబ్బంది ఉన్నారు.

'ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వస్తా'

జన్నారం: నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వస్తున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ రిటైర్డ్ మేనేజర్ జాదవ్ రాంకిషన్ నాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో చేరి ఖానాపూర్ నియోజకవర్గంలో ఆ పార్టీ తరుపున పోటీ చేస్తానని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసి ముహూర్తం ఖరారు చేశానని, త్వరలో పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. జన్నారం మండలం ధర్మారం తాండాకు చెందిన నేను, ఖానాపూర్ లోకల్‌కు చెందిన వాడినన్నారు. నాన్‌లోకల్ వారికి అవకాశం ఇవ్వకుండా, లోకల్ అభ్యర్థులకు ప్రజలు అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో నాయకులు పున్నం నాయక్, చౌహాన్ రాంనాయక్ ఉన్నారు.

ఆవడం బస్సు పునరుద్ధరించాలి

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల సౌకర్యార్థం మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచి ఆవడం, కుశ్నపల్లి ప్రాంతాలకు వెళ్లే బస్సులను పునరుద్ధరించాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం మంచిర్యాల డీఎం రవీంద్రనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. బెల్లంపల్లి నుంచి కుశ్నపల్లికి సాయంత్రం4.30గంటల ప్రాంతంలో సౌకర్యంగా ఉంటుందన్నారు. పాఠశాల సమయంలో బస్సులను నడిపించాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు చరణ్, కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.100
పచ్చిమిర్చి	120
బోడకాకర	200
వంకాయ	60
కాకరకాయ	80
బెండకాయ	50
అలసంద	60
దొండకాయ	80
సొరకాయ	40
ఆకుగోబి	60
పూగోబి	80
క్యారెట్	80
క్యాప్సికం	80
పాలకూర	40
తోటకూర	40

- మంచిర్యాలఅగ్రికల్చర్



బెల్లంపల్లి కేంద్రంగా రైతుబజార్

- పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట స్థలం ఎంపిక
- రూ.2కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తి
- త్వరలోనే పనులు ప్రారంభం



రైతుబజారు కోసం కేటాయించిన సింగరేణి లీజు స్థలం

బెల్లంపల్లి: దీర్ఘకాలం నుంచి ఎదురుచూస్తున్న రైతుల చిరకాల వాంఛ నెరవేరబోతోంది. బెల్లంపల్లి కేంద్రంగా అన్ని రకాల సౌకర్యాలతో రైతుబజారు నిర్మించడానికి రూ.2కోట్ల నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తయింది. రైతుబజారు నిర్మాణం పనులు ప్రారంభించడానికి సన్నద్ధమవుతున్నారు. నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య రైతుబజారు నిర్మాణానికి భూమిపూజ చేయడంతో రైతుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. రైతుబజారు ఏర్పాటు కావడం వల్ల కూరగాయలు పండించే రైతులకు ఎంతగానో ప్రయోజనం కలగనుంది. పండించిన పంట ఉత్పత్తులను దళారులకు కట్టబెట్టకుండా, నేరుగా రైతులే మద్దతు ధరకు అమ్ముకోవడానికి వీలు కలగనుంది. మరోపక్క పంట ఉత్పత్తులు కాస్తా తక్కువ ధరకు కొనుగోలు దారులకు లభించనున్నాయి. రైతుబజారు వల్ల అటు రైతాంగానికి ఇటు కొనుగోలు దారులకు ఏకకాలంలో ప్రయోజనం కలగనుంది.

రైతులకు ఎంతో మేలు..

బెల్లంపల్లి కూరగాయల మార్కెట్‌కు చుట్టు పక్క ప్రాంతాల నుంచి రోజువారీగా కూరగాయలు సరఫరా అవుతాయి. కన్నెపల్లి, భీమిని, బెల్లంపల్లి, కాసిపేట, తాండూర్, ఆసిఫాబాద్ జిల్లా పరిధి గంగాపూర్ తదితర ప్రాంతాలకు చెందిన గ్రామీణులు పండించిన కూరగాయలను మార్కెట్‌కు తీసుకొచ్చి హోల్‌సెల్ వ్యాపారులకు అమ్మకాలు చేయడం, ఏళ్ల తరబడి నుంచి ఆనవాయితీగా వస్తోంది. హోల్‌సెల్ వ్యాపారులు ఆ కూరగాయలను మారు బేరం వ్యాపారులకు కట్టబెట్టడం, సదరు వ్యాపారులు ధర పెంచి విక్రయిస్తుండగా, పండించిన రైతుకు గిట్టుబాటు ధర లభించలేని పరిస్థితులు ఉన్నాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు మద్దతు ధర లేక రైతులు తీవ్ర కష్టనష్టాలకు గురికావడం సర్వసాధారణంగా మారింది. కొందరు హోల్‌సెల్ వ్యాపారుల ప్రోద్బలంతో రైతులను మార్కెట్‌లో కూరగాయలను అమ్ముకోకుండా మారుబేరం వ్యాపారులు అడ్డుకోవడం, గొడవలు చేయడం చేశారు. తీవ్రస్థాయిలో ఒత్తిడికి గురి చేశారు. ఈ క్రమంలో రైతుబజారు ఏర్పాటు చేయాలనే డిమాండ్ వచ్చింది. ఆలస్యంగానైనా రైతుబజారు కోసం భూమిపూజ జరగడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఎవరికి భయపడకుండా రైతులు పంట ఉత్పత్తులు అమ్ముకోవడానికి ఆధారం లభించనుందనే ఆశ రైతుల్లో వ్యక్తమవుతోంది. వాస్తవానికి ఎనిమిదేళ్ల క్రితమే రైతు బజారు ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఇన్నాళ్లకు కానీ కొలిక్కి రాలేకపోయింది.

పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట...

రైతుబజారు ఏర్పాటు కోసం అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేశారు. పురప్రజలకు అందుబాటులో ఉన్న బెల్లంపల్లి పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న సింగరేణి లీజు స్థలాన్ని ఎంపిక చేశారు. ఇక్కడ రైతుబజారును ఏర్పాటు చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రైతులకు, పుర ప్రజలకు సౌలభ్యం కలగనుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఇక్కడ కరోనా వైరస్ ప్రబలినప్పటి నుంచి తాత్కాలిక ప్రాతిపదికన కూరగాయల విక్రయాలు జరుగుతున్నాయి. అతి త్వరలో రైతుబజారు నిర్మాణ పనులు ప్రారంభం కానుండటంతో రైతుల ఆశలు ఫలించనున్నాయి.


ఆధునికంగా నిర్మిస్తాం..



రైతుబజారు ఏర్పాటు చేయడానికి తగిన నిర్ణయం జరిగింది. రైతుబజారును నిర్మించడానికి రూ.2కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇటీవలనే భూమిపూజ కూడా చేశాం. అతి త్వరలో నిర్మాణ పనులను ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నాం. రైతుబజారు వల్ల రైతులు, వినియోగదారులకు ప్రయోజనం కలగనుంది. మరోపక్క ఆధునిక సౌకర్యాలతో కూరగాయల మార్కెట్‌ను కూడా నిర్మిస్తున్నాం. మార్కెట్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి.

- దుర్గం చిన్నయ్య, ఎమ్మెల్యే, బెల్లంపల్లి

తాండూర్‌లో ఉర్సుకు సర్వం సిద్ధం



తాండూర్: ఉర్సుకు జిల్లాలోని తాండూర్ దర్గా సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. నేటి నుంచి(శని, ఆది వారాల్లో) రెండు రోజుల పాటు కనుల పండువగా ఉర్సు జరుగనుంది. స్థానిక వాసులే కాకుండా, సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు వేలాదిగా రానున్నారు. ఉర్సును ఘనంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. ముఖ్యంగా దర్గాకు రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. ప్రత్యేకంగా రంగుల బల్బులను ఏర్పాటు చేశారు. రాత్రిపూట కనువిందు కలిగించేలా అలంకరణ చేసినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ బానయ్య తెలిపారు.

ప్రత్యేకంగా నిలువనున్న కవ్వాలి ప్రోగ్రాం...

ఉర్సులో దశాబ్దాల నుంచి కవ్వాలి ప్రోగ్రాం నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఏటా వివిధ ప్రాంతాల నుంచి ప్రఖ్యాతిగాంచిన కళాకారులు, గాయకులను ఆహ్వానించి కవ్వాలి ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతోంది. ముంబై, చంద్రపూర్, బల్లర్షా, న్యూఢిల్లీ తదితర ప్రాంతాల నుంచి గాయకులు వచ్చి తమ గాన కచేరిని నిర్వహించి ఆకట్టుకుంటున్నారు. ఈ సారి కూడా కవ్వాలి ముఖాబిల్లాను ఏర్పాటు చేశారు. ఇండోర్, బెంగళూరు కళాకారులు, గాయకులను కవ్వాలికి ఆహ్వానించారు. ఉర్సులో కవ్వాలి ముఖాబిల్లా మారుమోగబోతోంది.

'దళిత రైతును కొట్టిన వ్యక్తిని శిక్షించాలి'



మాట్లాడుతున్న నేతకానీ సంఘం జిల్లా కార్యదర్శి

నెన్నెల: కోటపల్లి మండలం షెట్‌పల్లి గ్రామానికి చెందిన దళితరైతు దుర్గం బాపును విచక్షత రహితంగా కొట్టిన సూరం రామిరెడ్డిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని నేతకానీ సంఘం జిల్లా కార్యదర్శి గట్టు బానేష్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు దుర్గం మల్లేష్ డిమాండ్ చేశారు. నెన్నెలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే, దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించి జైలుకు పంపించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు లింగయ్య, కుల సంఘం పెద్దలు పాల్గొన్నారు.

'కుల అహంకారం నశించాలి'

చెన్నూర్: నోరులేని పశువులు చేసిన తప్పుకు కుల అహంకారంతో ఒక వ్యక్తిని కులం పేరుతో దూషించి, కర్రకు కట్టేసి దాడి చేయడం హేయమైన చర్య అని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి గోపినాథ్ అన్నారు. దుర్గం బాపు అనే దళితుడిపై రెడ్డి సామాజికవర్గానికి చెందిన రాంరెడ్డి దాడి చేయడం దారుణమన్నారు. సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు రమేశ్, నాయకులు వెంకటేశ్, స్వామి, గోపి పాల్గొన్నారు.

దళితులపై దాడులు హేయమైన చర్య

జన్నారం: కాలం మారుతున్నా, దళితులపై జరుగుతున్న దాడులు హేయమైన చర్య అని నేతకానీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తాళ్లపెల్లి రాజేశ్వర్ పేర్కొన్నారు. రాంరెడ్డిని కఠిన శిక్ష పడేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో నేతకానీ సంఘం మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్, మాలమహానాడు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: కోటపల్లి మండలంలోని షెట్‌పల్లిలో దుర్గం బాపుపై సూరం రామిరెడ్డి చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ది నేషనల్ అంబేద్కర్ సేన నాయకులు పేర్కొన్నారు. రామిరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, కఠిన శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు.

దళితులకు ఇళ్ల పట్టాలు పంపిణీ



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండలోని నిరుపేదల దళితులకు శుక్రవారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఇంటి స్థలాలకు సంబంధించి ధ్రువీకరణ పట్టాలు పంపిణీ చేశారు. ఒక్కొక్కరికీ 75గజాల స్థలం చొప్పున 50మంది దళిత కుటుంబాలకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యం, ఎంపీపీ స్వర్ణలత, ఉప సర్పంచ్ అనూహ్య, పీఏసీఎస్ చైర్మన్ సత్తయ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దొనబండ గ్రామ ఉప సర్పంచ్ పోలాస అనూహ్య బీఆర్ఎస్ పార్టీలో చేరగా ఎమ్మెల్యే దివాకర్‌రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఉప సర్పంచ్‌తో పాటు ఆమె భర్త రంజిత్ పార్టీ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులగా పార్టీలో చేరినట్లు తెలిపారు.

ప్రమాణస్వీకారం

మంచిర్యాలటౌన్: జిల్లా హమాలీసంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎంపికైన చిట్టవేణి లక్ష్మణ్, కార్యదర్శి బోరకుంటి రాంచందర్‌లు శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య హాజరై నూతన అధ్యక్ష, కార్యదర్శులను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్, కౌన్సిలర్‌లు సురేశ్ బల్దువా, గాదె సత్యం, సిపిఐ రాష్ట్ర నాయకులు కలవేని శంకర్, మేకల దాసు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

ఘనంగా ముగింపు వేడుక



మాట్లాడుతున్న ఏరియా జీఎం మోహన్‌రెడ్డి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో గల కాన్ఫరెన్స్ హాల్లో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏరియా జీఎం హాజరై మాట్లాడారు. ఏరియాలో అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. పర్యావరణ అంశంలో మందమర్రి ఏరియాకు సింగరేణి వ్యాప్తంగా రెండో స్థానం లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన సింగరేణీయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్వో టు జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీవైపీఎం మైత్రేయబంధు, సత్యబోస్, ఆఫీస్ ఓఎస్ రాజలింగు, యూనియన్ల ప్రతినిధులు ఉన్నారు.

'ఉద్యోగులందరూ పాల్గొనాలి'

నస్పూర్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్‌గర్ తిరంగా కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియాలోని కార్మికులు, ఉద్యోగాలు అందరూ పాల్గొనాలని పర్సనల్ డీజీఎం అరవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 13నుంచి ఆగస్టు 15వరకు వారి నివాస గృహాలపై పగలు, రాత్రి వేళల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేసి, జాతీయ స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు.

ఈ రోజు పవర్‌కట్ ప్రాంతాలు



మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా 12వ తేదీ శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల ఏఈ మహేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాజీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని హాజీపూర్, టీకానపల్లి, దొనబండ, పెద్దంపేట, బుద్దిపల్లి, కొండాపూర్, కర్ణమామిడి, పడ్తనపల్లి, రాంపూర్ గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాసిపేటలో...

కాసిపేట: మండలంలోని కొండాపూర్ సబ్‌స్టేషన్‌లో ఫీడర్ల మరమ్మతులు చేపట్టనున్నందునా శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు.

వేమనపల్లిలో...

వేమనపల్లి: నీల్వాయి సబ్‌స్టేషన్ పరిధిలోని 18గ్రామాలకు శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ దీక్షిత్ తెలిపారు.

భీమారంలో...

భీమారం: మండలంలోని వివిధ గ్రామాలకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్తు శాఖ ఏఈ కుమారస్వామి శుక్రవారం తెలిపారు. మండల కేంద్రంలోని 33కెవీ/11కెవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్తు సరఫరా చేసే లైన్లకింద ఉన్న చెట్ల కొమ్ములు నరికివేయనున్నట్లు తెలిపారు.

నస్పూర్‌లో..

నస్పూర్: నేడు పట్టణ పరిధిలోని అన్ని వార్డుల్లో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 2:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని నస్పూర్ ఏఈ రామ్మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ వల్ల ఈ అంతరాయం ఉంటున్నట్లు, వినియోదారులు సహకరించాలని కోరారు.

జన్నారంలో...

జన్నారం: మండలంలో ఈ నెల 12న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ లచ్చయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ మరమ్మతుల నిమిత్తం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

తాండూర్‌లో...

తాండూర్: తాండూర్, రేచినీ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో శనివారం మరమ్మతులు చేపట్టనుండటంతో గ్రామాల్లో కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తాండూర్ డిస్కం ఏఈ బి.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి 1గంట వరకు మండల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గడువు ముగిసింది.. నిరాశే మిగిలింది



తీసుకోకపోవడంతో వెనుదిరిగిన దరఖాస్తుదారులు

దండేపల్లి: గృహలక్ష్మి పథకం నిరంతర ప్రక్రియ అని మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్పిన మాటలు నీటి మూటలే అన్న చందంగా మారాయి. గృహలక్ష్మి పథకానికి అర్హులైన కొందరు దరఖాస్తు చేసుకోవడానికి శుక్రవారం దండేపల్లి తహసీల్దార్ కార్యాలయానికి రాగా, అధికారులు దరఖాస్తులను తిరస్కరించారు. పదో తారీకు వరకు మాత్రమే గడువుందని, నిరంతర ప్రక్రియ అంటూ.. అధికారికంగా ఆదేశాలు రాలేదని తెలిపారు. దీంతో చేసేదేమీ లేక దరఖాస్తు దారులు నిరాశతో వెనుదిరిగారు. ఈ విషయమై తహసీల్దార్ సంధ్యారాణిని సంప్రదించగా పదో తేదీ వరకు మాత్రమే దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.

బీజేపీ శ్రేణుల ముందస్తు అరెస్టు



హాజీపూర్ పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నాయకులు

తాండూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/నెన్నెల/జన్నారం/నస్పూర్: నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణంపై ప్రభుత్వం వైఖరిపై బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో కలెక్టర్ ఎదుట ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా బీజేపీ, బీజేవైఎం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. తర్వాత సొంతపూచికత్తుపై విడుదల చేశారు. అరెస్టైన వారిలో తాండూర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు మహీధర్ గౌడ్, పార్టీ అధికార ప్రతినిధి శ్రీ కృష్ణ దేవరాయలు, హాజీపూర్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముల్కల్ల మల్లారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు ఆకుల అశోక్‌వర్ధన్, జిల్లా అధికార ప్రతినిధి తులా మధుసూధన్‌రావు, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి చౌదరి రాకేశ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆరెందుల రాజేశ్, నెన్నెలలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పట్టి కృష్ణ, జన్నారంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోలి చందు, బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్, బీజేవైఎం మండల అధ్యక్షుడు ముడుగు ప్రవీణ్, నస్పూర్‌లో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్టి వెంకటకృష్ణ, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కొండ వెంకటేశ్, నాయకులు తదితరులు ఉన్నారు.

విద్యా సామగ్రి అందజేత

దండేపల్లి: మండలంలోని మాదాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు దండేపల్లి లయన్స్‌క్లబ్ తరుపున ఉచితంగా నోట్‌బుక్‌లు, పెన్నులు, పెన్సిళ్లను శుక్రవారం అందించారు.

కాసిపేట: మండలంలోని గుండ్లపాడు గిరిజన ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చేయూత స్వచ్ఛంద సేవాసమితి కాసిపేట గని సర్వే డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు.

జైపూర్: మండలంలోని వేలాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంథినికి చెందిన శ్రీ సీతారామ సేవా సదన్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు.

మహిళల భద్రత.. షీ టీమ్ బాధ్యత



మంచిర్యాలక్రైం: మహిళల భద్రత, రక్షణ షీ టీమ్ పోలీసుల బాధ్యతనేనని షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్సై హైమా అన్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా క్రేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థులకు, సిబ్బందికి షీ టీమ్ కార్యక్రమాలపై 'మీ భద్రత.. మా లక్ష్యం' అనే నినాదంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహిళల భద్రత కోసం కమిషనరేట్ పరిధిలో 'అభయ' అనే మొబైల్ అప్లికేషన్ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ అప్లికేషన్‌లో ఆటోలో వెళ్తున్నప్పుడు, ఏదైనా ఆపద ఎదురైనప్పుడు ఉపయోగించుకోవాలన్నారు. యాప్ ఉపయోగంపై అవగాహన కల్పించారు. ఉద్యోగం చేస్తున్న స్థలంలో, రాకపోకల సమయంలో ఎవరైన వేధింపులకు గురి చేస్తే, సెల్‌ఫోన్‌లో అసభ్యకరమైన మెస్సేజ్‌లు చేసినా ధైర్యంగా ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలు, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్, హక్ హైపై అవగాహన కల్పించారు. అత్యవసన సమయంలో 100కు గాని, షీ టీమ్ వాట్సాప్ నంబర్63039 23700కు మెస్సేజ్ చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్సై ఓబులమ్మ, కానిస్టేబుళ్లు జ్యోతి, జీ.సతీష్, పాఠశాల ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆండాళమ్మ కాలనీ సమస్యలపై దృష్టి

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ఆండాళమ్మ కాలనీ ప్రజలు డంపింగ్ యార్డుతో దుర్వాసన, పొగతో ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలపై దృష్టిసారించి, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ నీల కంఠేశ్వర్‌రావు అన్నారు. ఆండాళమ్మ కాలనీ ప్రజల సమస్యలను శుక్రవారం అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అండగా ఉంటుందన్నారు.

'రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే'

జైపూర్: రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అధికారంలోకి వచ్చాక రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు రామిల్ల రాధిక తెలిపారు. జైపూర్ మండలం కుందారంలో శుక్రవారం ఆమె మహిళా రైతులతో కలిసి పొలంలో వరినాట్లు వేశారు. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలను సబ్సిడీపై అందిస్తామని భరోసా ఇచ్చారు.

కాలువ ఏర్పాటు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని మంగలికుంట వద్ద చుట్టూ ఉన్న భూమి ఆక్రమణకు గురవుతుందని ఇరిగేషన్ అధికారులు కుంట వద్ద జేసీబీతో కాలువ తీయించారు. కొంతమంది వ్యక్తులు కాలువలో చెత్త, మట్టి పోస్తు ఆక్రమించడంతో పూడుకుపోయిందని, దీంతో నీళ్ల పెరిగి కుంట కట్ట తెగిపోయే ప్రమాదం ఉండటంతో కాలువ తీయించినట్లు తెలిపారు.

పరామర్శ

కాసిపేట: తెలంగాణ ప్రాంతంలోని లంబాడి గిరిజనులకు 1976లో రిజర్వేషన్ రావడానికి కృషి చేసిన అమర్‌సింగ్ తిలావత్‌ను శుక్రవారం జిల్లా లంబాడి జేఏసీ అధ్యక్షుడు, సోమగూడెం కె సర్పంచ్ సఫాట్ శంకర్ పరామర్శించి శాలువాతో సన్మానించారు. ఇటీవల గుండె ఆపరేషన్ జరగ్గా కోలుకోవాలని ప్రార్థిస్తూ, హైదరాబాద్ కాచిగూడలో ఆయన నివాసంలో కలిసి లంబాడి గిరిజనులకు సేవలు అందించాలని కోరినట్లు తెలిపారు.

'గృహలక్ష్మి అమలు చేయాలి'

మందమర్రిరూరల్: సొంత స్థలంతో సంబంధం లేకుండా సొంతిల్లు లేని పేదవారికి గృహలక్ష్మి కింద రూ.3లక్షలు అందించాలని టీడీపీ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సంజయ్‌కుమార్ శుక్రవారం డిమాండ్ చేశారు.

ఆప్ జిల్లా సెక్రెటరీగా నయీంపాషా

నస్పూర్: పట్టణ పరిధిలోని అరుణక్కనగర్‌కు చెందిన నయీంపాషా ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా సెక్రెటరీగా నియామకమయ్యాడు. విలేజ్ శ్రీరాంపూర్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర కన్వీనర్ సుధాకర్ నియామకపత్రాన్ని అందించారు.